ప్రగతి-వనిత వినియోగదార్ల కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

# ఘోరమైన ద్రోహులు

బిందు

కడుపులో కదలాడేది ఆడబిడ్డో, మగబిడ్డో తెలియని స్థితిలో కొందరు..

నా కడుపులో పెరిగే ఆడబిడ్డకు జన్మనివ్వబోయేది నేనే అయినా ఆ బిడ్డకు బీజం మీరు వేసిందే కదండీ..? అన్నట్లు భర్త వంక దీనంగా చూస్తూ కొందరు..

నా భార్య కడుపులో పెరిగేది మగబిడ్డే..! అని మీసం మెలేసే భర్త వంక అమాయకంగా చూస్తూ ఇంకొందరు..

గర్భంలో పెరిగి పెద్దవుతున్న బిడ్డను కాలగర్భంలో కలిపేయడానికి మనసంగీకరించక పోయినా అయిష్టంతో అబార్షన్ కోసం సిద్ధపడ్డ అభాగ్యులు ఇంకొందరు..

వెరసి మొత్తం మీద హాస్పటల్ కారిడార్‌లో దాదాపు అందరూ గర్భవతులే..!

నగరంలో పేరుమోసిన మెటర్నిటీ హాస్పటల్లో గర్భవతులుకాక మరెవ్వరుంటారు..?

నవ్వొచ్చింది. నవ్వుకుంటున్న నా దగ్గర కొచ్చి -

"మేడమ్.. నెక్స్ట్ మీరే.." అంది నర్స్.

"థాంక్యూ.." అని నా కేస్‌షీట్ తీసుకుని డాక్టర్ గదిలోకి వెళ్ళేందుకు నిబడ్డాను.

డాక్టర్ గదిలోంచి పేషంట్ బయటకొచ్చిన వెంటనే మెల్లగా కన్సల్‌టేషన్ గది వైపు నడవసాగాను. ఆరో నెల గర్భానికే నానడక మారింది. నానడక చూసి -

"కాస్త తొందరగా నడవండి మేడమ్.. ఇప్పుడే ఇలా నడిస్తే తొమ్మిదో నెలలో ఎలా నడుస్తారో.." అంటూ నవ్వింది నర్స్.

కన్సల్‌టేషన్ గదిలోకి వెళ్ళి డాక్టర్ ఎదురుగా కూర్చున్నాను. టేబుల్ మీద నేమ్‌ప్లేట్‌లో "డా॥ సత్యవతి, గైనకాలజిస్ట్" అన్న బంగారు రంగు అక్షరాలు తళతళా మెరుస్తున్నాయి. గైనకాలజీలో సత్యవతిని మించినవారు ఈ నగరంలో లేరన్న పేరు సంపాదించింది. ప్రైవేటు ప్రాక్టీసు ప్రారంభించిన ఐదేళ్ళకే ఐదు నక్షత్రాల ఆసుపత్రి అప్పు లేకుండా కట్టగలిగిందంటే పేరుతోపాటు ఆమె ఎంత డబ్బు సంపాదించిందో అర్థం చేసుకోవచ్చు. ఎన్ని లక్షలు సంపాదించినా ఈనాటికీ పేషంట్లని ఎంతో ఓపిగ్గా జాగ్రత్తగా పరీక్షిస్తుందన్న పేరుంది.

"ఏమ్మా... ఎలా వుంది ఆరోగ్యం..? మందులన్నీ సక్రమంగా వాడుతున్నావు కదూ..?" కేస్‌షీట్ తిరగేస్తూ అడిగింది డాక్టర్ సత్యవతి.

"మందులన్నీ సక్రమంగానే వాడుతున్నాను. ఆరోగ్యం కూడా బాగుంది. మంచి డైట్ తీసుకుంటున్నాను."

"గుడ్.. కీపిటప్.. అన్నట్టు లాస్ట్‌మంత్ స్కానింగ్ చేయలేదు కదూ?"

"లేదు మేడమ్."

"అలాగైతే ఈరోజు స్కానింగ్ చేసి బిడ్డ పెరుగుదల ఎలా వుందో చూస్తాను. ఆ టేబుల్‌మీద పడుకోమ్మా."

నర్స్ సహాయంతో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఎక్విప్‌మెంట్ ప్రక్కనున్న టేబుల్ మీద వెల్లకిలా పడుకున్నాను. డాక్టర్ ఐదు నిముషాల్లో స్కానింగ్ చేసి,

"బిడ్డ పెరుగుదల బాగుందమ్మా. గుడ్" అంటూ వెళ్ళి కుర్చీలో కూర్చుంది.

"మేడమ్..కడుపులోని బిడ్డతోపాటు డెలివరీ మీద భయం కూడా పెరుగుతోంది." డాక్టర్ ఎదురుగా కూర్చుంటూ చెప్పాను.

"మొదటి డెలివరీ కదా.. అలానే వుంటుంది." అని నవ్వింది.

"అది కాదు మేడమ్.. సుఖ ప్రసవానికి ఇప్పటినుంచే ఏవో ఎక్సర్‌సైజులూ అవీ చేస్తే మంచిదని మా ఫ్రెండొకావిడ చెప్పింది."

"నీ బాడీ కండిషన్, బిడ్డ ఎదుగుదలా చూస్తుంటే.. నీకు చాలా ఈజీ డెలివరీ అవుతుందని పిస్తోంది. డెలివరీలో ఏ కాంప్లికేషన్స్ వుండవు. నువ్వేం పెంచుకోనవసరం లేదు. సరేనా..?"

"ఈజీ డెలివరీ కోసం నేను ఎక్సర్‌సైజులు చెయ్యనవసరం లేదంటారా?"

"ఎక్సర్‌సైజులు చేస్తే మంచిదే కనుక చెయ్యాలనుకుంటే చెయ్యి.." అని.. నర్స్ వైపు తిరిగి "సిస్టర్.. డెలివరీ ఎక్సర్‌సైజుల పాంప్లెట్ ఒకటిచ్చి ఎలా చెయ్యాలో వివరించి చెప్పు.." అని నర్స్‌తో చెప్పింది.

"థాంక్యూ మేడమ్.. వస్తాను." అని లేచి నర్స్‌తో పాటు బయటకొచ్చాక, గర్భవతులు చేయాల్సిన ఎక్సర్‌సైజులు బొమ్మల్తోసహా వివరిస్తూ అచ్చేసి వుంచిన పాంప్లెట్ చేతికిచ్చి ఎలా చేయాలో వివరించింది.

నర్స్ చెప్పిందంతా బాగా విన్న తర్వాత..

"వెళ్ళొస్తానండీ.." అన్నాను.

"మంచిది" అని దగ్గరకొచ్చి.. "అన్నట్టు..మేడమ్ మీకు స్కానింగ్ తీసారు కదా.. కడుపులో పెరిగేది ఆడపిల్లో మగపిల్లాడో తెలుసుకోవాలని లేదా మీకు..?" అని మెల్లగా అడిగింది నర్స్. ఆవిడెందుకలా అడిగిందో అర్థంకాక మొహం అదోలా పెట్టాను.

"స్కానింగ్ ఖర్చులు కాకుండా ఓ వెయ్యి రూపాయ లెక్కువిస్తే.. ఏబిడ్డో చెప్తుంది." అంది నర్స్.

"స్కానింగ్ చేసింది కడుపులోని బిడ్డ పెరుగుదల చూడ్డానికేగా?" అనుమానంగా అడిగాను.

"అవుననుకోండి.. కాకపోతే బిడ్డ పెరుగుదల చూసిన డాక్టర్‌కి.. ఏబిడ్డో కూడా తెలుస్తుందిగా".

పెరిగే బిడ్డ ఆరోగ్యంతోపాటు, ఏబిడ్డో కూడా తెలుసుకోవడం, దానికి అదనంగా ఇంకో వెయ్యి గుంజి ఏబిడ్డో చెప్పడం, తద్వారా భార్యభర్తల మధ్య అనవసరమైన గొడవలు, తమకి కావలసిన బిడ్డ కాకపోతే అబార్షన్ చేయించుకోమని వత్తిడి, ఐదారు నెలల్లో అబార్షన్ చేయడం వల్ల కలిగే అనారోగ్యం, ఒకోసారి ప్రాణాలు కూడా పోతాయంటుంటారు..

ఇవన్నీ కేవలం స్కానింగ్ తీసిన డాక్టర్లు డబ్బు కాశపడి ఏబిడ్డో చెప్పడంవల్లే కదా..

"మీకే బిడ్డో తెలుసుకోవాలని లేదా...?" అడిగింది నర్స్.

"ఎందుకు తెలుసుకోవాలి?" నేనిలా అడుగుతానని ఊహించని నర్స్ అదోలా మొహం పెట్టింది. కడుపులో పెరిగేది ఏబిడ్డో తెలుసుకుంటే కాన్పు చివరి క్షణాల వరకూ వుండే సస్పెన్స్ విడిపోతుంది కదా..? అసలు తెలుసుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటి? తల్లికి ఏ బిడ్డ అయినా ఒకటే కదా?

"ఏబిడ్డో తెలుసుకోవాల్సిన అవసరం లేకపోతే వద్దులెండి.." అని వెళ్ళిపోబోతున్న నర్స్‌తో,

"చూడండి.. మాతృత్వమన్నది స్త్రీకి ప్రకృతి ప్రసాదించిన గొప్పవరం. ఏబిడ్డయితే ఏం చెప్పండి? సాంకేతికంగా, వైజ్ఞానికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈరోజుల్లో గర్భిణీ స్త్రీలు తెలుసుకోవాల్సింది కడుపులో పెరిగేది ఏబిడ్డని కాదు, బిడ్డ ఆరోగ్యం ఎలా వుందని తెలుసుకోవాలి."

నామాటలు అర్థమయ్యాయో లేదోగానీ.. "నాకెందుకులెండి." అంటూ వెళ్ళిపోయిందా నర్స్.

నా ఆరోగ్యంతోపాటు కడుపులో పెరిగే బిడ్డ ఆరోగ్యం కోసం ఆకుకూరలు, తాజాపండ్లు, పాలు, గ్రుడ్లు లాంటి సంపూర్ణ పోషక విలువలున్న ఆహారం తీసుకుంటూ, సుఖ ప్రసవం కోసం ఉదయం సాయంత్రం రెండు పూటలా పాంప్లేటులోని ఎక్సర్‌సైజులు చేస్తూ మూణ్ణెల్లు గడిపేశాను.

"సాయంకాలానికి నీకు సుఖ ప్రసవం అవుతుంది. డోన్ట్‌వర్రీ..!" నర్సింగ్ హోమ్‌లోని బెడ్ మీద పడుకొని వీక్లీ తిరగేస్తున్న నాదగ్గర కొచ్చి చెప్పివెళ్ళింది డాక్టర్ సత్యవతి.

నేనుండే గది ఫైవ్ స్టార్ హొటల్ గదికంటే కూడా ఎంతో అందంగా డెకరేటివ్‌గా వుంది. పేషంట్లకి బోర్ కొట్టకుండా వుండడానికి కేబుల్ టీవీ, ఛానల్ మ్యూజిక్ ఏర్పాట్లు కూడా వున్నాయి.

గదిలో కొచ్చినపుడు ఈ సదుపాయాలన్నీ చూసి, "పేషంట్లకి ఇన్ని సదుపాయాలు అవసరమా?" అన్నిం



చింది. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో కడుపులో ఎక్కడో ఓమూల కలుక్కుమన్పించేసరికి నర్స్‌తో చెప్పాను. వెంటనే నాదగ్గర కొచ్చి కడుపు అంతా ఒత్తి పరీక్ష చేసి..

"సిస్టర్..! నొప్పులు మొదలయ్యేటట్లున్నాయి. లేబర్ రూం అరేంజ్‌మెంట్స్ చూడు." అని నర్స్‌తో చెప్పి, "చూడమ్మా.. ఇంకో గంటాగంటన్నరలో డెలివరీ అయిపోవచ్చు. ఈజీగానే డెలివరీ అవుతుందిలే, భయం లేదు." అంటూ వెళ్ళిపోయింది సత్యవతి.

ఐదూ ఐదున్నర మధ్య విపరీతమైన నొప్పులు..

భయంకరమైన బాధకు మెలికలు తిరిగిపోతూ అరవసాగాను. ఎంత కంట్రోల్ చేసుకుందామన్నా వీలు కావడంలేదు. నర్స్ వచ్చి లేబర్ రూంకి తీసుకెళ్ళింది.

భయంకరమైన నొప్పులు..

'మాతృత్వం స్త్రీకి ప్రకృతి ప్రసాదించిన గొప్పవరం' అని కొద్ది రోజులు క్రితం చెప్పిన నాకు..

"ఇదా గొప్పవరం? ఈ భయంకరమైన నొప్పులు భరించడమా గొప్పవరం?" అన్పిస్తోంది.

డాక్టర్ సత్యవతి లేబర్ రూంలో కొచ్చి మళ్ళీ ఇంకోసారి పరీక్షించి బయటకెళ్ళి..

"కడుపులో బిడ్డ అడ్డం తిరిగినట్టుంది. సిజేరియన్ చేయాలి. లేదంటే పెద్ద ప్రాణానికే ప్రమాదం.." అని నా భర్తతో అమ్మా నాన్నల్తో చెప్పడం..

వాళ్ళు.."మీయిష్టం.. ఏమైనా చేసి తల్లీ బిడ్డను కాపాడండి.. ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు" అనడం విన్న నాలో విపరీతమైన భయం జొరపడింది.

డాక్టరు ఇచ్చిన మందులన్నీ సక్రమంగా వాడానే? సుఖ ప్రసవానికి ఎన్ని రకాల ఎక్సర్‌సైజులు ఉన్నాయో అన్నీ క్రమం తప్పకుండా చేశానే.. భగవంతుడా నాకే ఎందుకీ బాధ..? ఏ వసతులూ లేని మారుమూల పల్లెటూర్లలోని స్త్రీలు, ఉన్న వసతుల్ని డబ్బుతో కొనుక్కోలేని పేద స్త్రీలకి ఎంతో ఈజీగా డెలివరీ అవుతుంటే నా పరిస్థితి మాత్రం ఏమిటి.. ఇలా..?

ఎంత అణచుకుందామనుకున్నా వీలుకాక బయటకు తన్నుకొస్తున్నాయి నాకేకలు..

"ప్లీజ్.. ఇంకొద్ది సేపు కంట్రోల్ చేసుకోమ్మా..! నీకేం భయం లేదు." నాదగ్గర కొచ్చి అభయమిస్తున్నట్లు చెప్పింది డాక్టర్ సత్యవతి.

"మేడమ్.. నాకు.. ఈజీ డెలివరీ కాదా..?" అంత బాధలోనూ ఎందుకో అలా అడగాలన్పించింది.

"నీకేం కాదు.. నువ్వూరికే టెన్షన్ పడొద్దు.." అని నర్స్ వైపు తిరిగి.

"సిస్టర్ సెడెటివ్ ఇంజక్షన్ ఒకటివ్వు" అంది డాక్టర్.

నాలోంచి తన్నుకొస్తున్న భయంకరమైన నొప్పులు వల్లేమో నర్స్ గుచ్చిన సిరెంజ్ నీడిల్ నొప్పి తెలియనేలేదు.

ఎన్నో మందులు.. ఎన్నెన్నో ఎక్సర్‌సైజులు చేసినా నాకెందుకు సుఖప్రసవం కావడంలేదు? ఆలోచనలతో సతమతమవుతోన్న నామెదడు శరీరానికి మత్తెక్కనివ్వకుండా అడ్డుపడుతోంది.

"డాక్టర్.. మీవారి దగ్గర్నుంచి ఫోన్.." అంటూ డాక్టర్ సత్యవతి చేతికి కార్డ్‌లెస్ ఫోన్ ఇచ్చింది నర్స్.

"హలో.."

".........."

"నో..నో.. ఇంకో అర్థగంటలో వచ్చేస్తున్నా.. తప్పకుండా వెళ్దాం."

"........"

"లేదండీ.. తప్పకుండా వచ్చేస్తానంటున్నాగా.. ఇదేం పెద్ద కాంప్లికేటెడ్ సిజేరియన్ కేసుకాదు.. చిన్న ఈజీ డెలివరీ కేసే..! కాకపోతే సిజేరియన్ చేస్తే బిల్లెక్కువ చెయ్యొచ్చుగా.. అందుకని బిడ్డ అడ్డం తిరిగిందని చిన్న డ్రామా.."

"........"

"అర్థగంట కూడా అవసరంలేదండీ.. ఇరవై నిముషాల్లో మీ దగ్గరుంటాగా.. సరేనా.. బై.." అంటూ ఫోన్ డిస్కనెక్ట్ చేసి గ్లవ్స్ తొడుక్కొని నాదగ్గరకొచ్చిన డాక్టర్ సత్యవతి వంక ఎంతో అసహ్యంగా చూస్తూ..గట్టిగా..

"డాక్టర్..!" అనరచాను.

"మత్తు సరిగా ఎక్కినట్లులేదు. ఇంకో ఇంజక్షన్ ఇవ్వు.." అని నర్స్‌తో చెప్పింది డాక్టర్.

"డాక్టర్.. నాకెప్పటికీ మత్తెక్కదు. ముందు మీ తలకెక్కిన డబ్బు మత్తు వదుల్చుకోండి.. ఆధునిక వైద్యం పేరుతో ఇలాంటి దోపిడీలు చేసి డాక్టరు వృత్తికే కళంకం తేవద్దు.." అని గట్టిగా అరవాలనుకుంటున్న నామాటలు గొంతులోనే ఆగిపోయాయి.

పదునైన స్టెరైల్డ్ కత్తితో సుతిమెత్తని నా శరీరభాగాన్ని చీలుస్తుంటే నొప్పి ఏమాత్రం తెలియలేదు.

కానీ నమ్మకాన్ని మోసంతో నిట్టనిలువునా చీల్చుతున్నందుకు మాత్రం నా శరీరంలోని అణువణువూ బాధతో భయంకరంగా ఆక్రోశించసాగింది.

డాక్టర్లని వినియోగదారుల ఫోరం పరిధిలోకి తీసుకొచ్చినా.. ఈ డాక్టరు మీద ఏమని కేసుపెట్టగలను?

ఎంతో నమ్మకంగా మోసం చేసే ఇలాంటి డాక్టర్లని వినియోగదారుల ఫోరం ముందు నిలబెట్టినా వారిని దోషులని నిరూపించడానికి సాక్ష్యాధారాలు ఎలా తేగలం? ❑